www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబర్ 2024
5
ఏలూరు



నేవీ ఆయుధ డిపోకు భూసేకరణపై నేడు గ్రామసభ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకవారి గూడెం పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ నిమిత్తం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ బి.సందీప్ తెలిపారు. ఈ గ్రామ సభ తొలుత ఈ నెల 29న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ ఒక్కరోజు ముందుగానే 28వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ పంచాయతీ పరిధిలోని ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అంతా హాజరు కావాలని కోరారు.



ఊరూ.. వాడా.. 'బెల్టు'..!



విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపుల ఏర్పాటు - ఒక్కో షాపునకు రూ.లక్ష వసూలు

వీటి కేటాయింపు కూడా ఎంఎల్ఎలు, స్థానిక నేతల కనుసన్నల్లోనే

ఒక్కోగ్రామంలో కనీసంగా నాలుగైదు బెల్టు షాపులు

ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ అధికారులు - ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం అమ్మకాలకు గేట్లు ఎత్తేశారు. ఒక అధికారిక దుకాణం పరిధిలో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు వెలిసిపోతున్నాయి. దీంతో రెండు జిల్లాల్లోనూ మద్యం ఏరులై పారే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో మద్యంతోపాటు నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా సాగగా, కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ మద్యం అన్నట్లు పరిస్థితి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, ఇప్పుడు ప్రయివేటుకు అప్పగించారు. ఈ నెల 16వ తేదీ నుంచి కొత్త షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. కొత్తగా మద్యం దుకాణం దక్కించుకున్నవారు నాన్ రిఫండబుల్ ఫండ్ కింద రూ.రెండు లక్షలు చెల్లించారు. రెండేళ్లలో రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంది. దీంతో పెట్టిన సొమ్ము రాబట్టుకోవడంతోపాటు భారీగా లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు, నేతలు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వం లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణ పరిధిలో పెద్దఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది.

బెల్టుషాపునకు రూ.లక్ష వసూలు

గ్రామాల్లో ప్రాంతాలవారీగా ఈ బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారు. బెల్టుషాపులకు సైతం పెద్దఎత్తున పోటీ సాగుతోంది. ఎంఎల్ఎ, స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ ప్రక్రియ సాగుతోంది. బెల్టుషాపు ఎవరికివ్వాలో ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టుషాపు కేటాయించిన వారినుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఒక అధికారిక మద్యం దుకాణం పరిధిలో తక్కువగా లెక్కించినా 20కుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యక్తులు క్వార్టర్ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 అదనంగా ధర వసూలు చేసేందుకు నిర్ణయించారు. వీరికి ముందుగా 40 నుంచి 50 వరకూ మద్యం బాటిల్స్ ఇస్తున్నారు. అమ్మకాలను బట్టి బాటిల్స్ అందించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు జనసేన ప్రజాప్రతినిధులు ఉన్నచోట్ల ఈ బెల్టుషాపుల ఏర్పాటు విషయంలో టిడిపి, జనసేన నేతల మధ్య రాజకీయ పోరు సాగుతుండటం విశేషం. బెల్టు షాపు ఏర్పాటుతో మద్యం ప్రతి వీధికి, ప్రతి పేటకు చేరుతున్న పరిస్థితి ఉంది. జనాలను తాగుబోతులుగా మార్చే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తోంది. బెల్టు దుకాణాల ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తికి తక్కువగా లెక్కించినా రూ.కోటి వరకూ ఖర్చవుతుందని, సొమ్ము రాబట్టుకోవాలంటే బెల్టుషాపులు తప్పనిసరని ప్రజాప్రతినిధులు మాట్లాడుతుండటం గమనార్హం. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలోనూ మద్యం బెల్టుషాపులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో ప్రతిపక్ష వైసిపి బెల్టు షాపులను ఆయుధంగా చేసుకుని ప్రచారం చేసింది. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమికి మద్యం బెల్టుషాపులు ముఖ్యకారణంగా చెప్పొచ్చు. మళ్లీ ఇప్పుడు సైతం అదే తరహాలో కూటమి ప్రభుత్వం బెల్టుషాపులను ప్రోత్సహిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైరల్ జ్వరాలతో జనం విలవిల

ముందుకు కదలని మురుగునీరు

ఫాగింగ్‌పై దృష్టి పెట్టని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి


గ్రామాల్లోని డ్రెయిన్లలో కదలని మురుగునీరు

ఇటీవల కురిసిన భారీ వర్షాల అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభించాయి. గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైంది. పంచాయతీ కార్యదర్శులకు ఫాగింగ్ ఊసే పట్టని పరిస్థితి. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పరిస్థితి దిగజారింది. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర జ్వరాలు తీవ్రమవుతున్నాయి. ప్రతి పల్లెలోనూ జ్వర పీడితులు మంచాన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. గతం కంటే ఓపికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. జ్వరమొస్తే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని పలువురు బాధితులు వాపోతున్నారు. వారానికి ఒకసారి ఫాగింగ్ చేయడం ద్వారా దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉన్నా చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మేజర్ పంచాయతీల్లో సైతం ఫాగింగ్ చేయడం లేదు. తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కన్పిస్తోంది. మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో మురుగునీటి పారుదల సరిగా లేదు. గ్రామాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్ల వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. డెంగీ కేసులు కూడా అక్కడక్కడా నమోదవుతున్నాయని సమాచారం. వ్యాధి నిర్ధారణకే వేలల్లో పరీక్షల కోసం ఖర్చు పెట్టాల్సి వస్తుందని, ఇక చికిత్సకు అయితే చెప్పనవసరం లేదని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని, జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


ముదినేపల్లిలో ప్రయివేట్ ఆసుపత్రిలో రోగులు కటకట

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

సిపిఎం మండల మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం మండల మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఎం ఐదో మండల మహాసభ స్థానికంగా సిహెచ్.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై వారి కష్టాలు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి మండలంలో సాగుభూములకు నీరందించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు నెలలవుతున్నా ఇంకా పలు హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం నేత కె.శ్రీనివాసరావు కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. అనంతరం పలు అంశాలపై మహాసభ తీర్మానాలను ఆమోదించింది. మొక్కజొన్న కంపెనీల మోసాలు అరికట్టాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించాలని, కౌలురైతులకు రుణాలు అందించాలని, ఉపాధి హామీ కింద 200 రోజులు పని చూపి రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని కోరుతూ మహాసభలో తీర్మానాలు ఆమోదించారు. మహాసభలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి మురళీ, నేతలు కె.రమేష్, దుర్గారావు తదితరులు మాట్లాడారు.



పతాకావిష్కరణ సందర్భంగా నినదిస్తున్న ప్రతినిధులు, నేతలు


వసతిగృహం శుభ్రం చేస్తున్న సిబ్బంది

విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - కలిదిండి

విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆదివారం సందర్శించి, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో హాస్టల్ ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోండి

6 వరకు గడువు

ప్రజాశక్తి - కామవరపుకోట

త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్ నమోదు గడువు నవంబర్ ఆరో తేదీతో ముగుస్తుందని తహశీల్దార్ జి.ఎలీషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2021 సవంత్సరం ముందు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. వారు ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://ceoaperolls.ap.gov.in ద్వారా లేదా గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి నమూనా ఫారం పూర్తి చేసి దరఖాస్తును తహశీల్దార్ కార్యాలయంలో అందించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. చదువుకున్న యువత సమాజం పట్ల బాధ్యతగా రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్లుగా నమోదై ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి అని తెలిపారు.


యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ ఏలూరు మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న సంవత్సర కాలానికి నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా పి.సురేష్‌బాబు, అధ్యక్షులుగా ఎస్‌కెవిఎస్.మణి, సహాధ్యక్షులుగా పి.ముకుందలక్ష్మి, డి.పూర్ణశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.కనకదుర్గ, కోశాధికారిగా ఎ.స్వర్ణలత, కార్యదర్శులుగా పివి.జనార్ధనరావు, టిఇఎన్‌డి.ప్రసాద్, వహీదా బేగం, సత్య సౌమ్య, చిన్నికృష్ణ, బాల సుబ్రహ్మణ్యం, పి.ప్రసన్నకుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎస్‌కె.పూరాఖాన్, ఒవి.ధనుంజయరావ్, డి.మాధవీలత, ఎన్.రామారావు, శ్యామల, 30 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, నాయకులు సుభాని బేగం, బి.మోహన్‌రావు, టి.ఆశయ్య పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న యుటిఎఫ్ మండల నూతన కమిటీ సభ్యులు

చెకుముకి పోటీల్లో గోపన్నపాలెం విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - దెందులూరు

సైన్స్ సంబరాల్లో భాగంగా ఆదివారం బిజిటిఒ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా ఫస్ట్ సాధించారు. హేమంత్ బాబు, నితిన్ చక్రవర్తి, సోహన్, సత్య కార్తీక్‌లు తాము పొందిన శిక్షణ ప్రతిభతో జిల్లా ఫస్ట్ సాధించి గోపన్నపాలెం ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పలువురు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

29న కైకరంలో జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న జిల్లా స్థాయి అండర్ 14,17 బాలబాలికల ఖోఖో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గం నుంచి 650 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరు కానున్నారని ఆయన చెప్పారు. ఈ మేరకు క్రీడామైదానం ముస్తాబు, ఇతర ఏర్పాట్లను సర్పంచి సలగల గోపీ, నిర్వాహక కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు స్టేట్ టీమ్‌లో ఆడనున్నారు.


కైకరం క్రీడామైదానంలో పచ్చగడ్డి ట్రిమ్మింగ్ ఏర్పాట్లు

ఆ కార్యదర్శి రూటే వేరు..!

మందలపర్రు పంచాయతీ కార్యదర్శి తీరుపై విమర్శలు

రోజుల తరబడి కార్యాలయంలో కన్పించడం లేదని చర్చ

అధికారి తీరుతో తీవ్ర ఇబ్బందుల్లో కిందిస్థాయి ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం మందలపర్రు పంచాయతీ కార్యదర్శి తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులోగాని, విధి నిర్వహణలోగాని తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. విధులకు ఏరోజు వస్తారో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో అదే మండలంలో క్రొవ్విడి పంచాయతీకి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ఉండటంతో సాకులు చెప్పి తప్పించుకునేవారని, కార్యదర్శుల బదిలీల తర్వాత ఇన్‌ఛార్జి బాధ్యతలు లేకపోయినా ఆయన తీరు మాత్రం మారలేదనే చర్చ సాగుతోంది. సదరు కార్యదర్శి కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేస్తారా.. ఆయన హాజరుకు సంబంధించిన వివరాలను, విధులకు సంబంధించిన సమాచారాన్ని కచ్చితంగా కార్యాలయంలో నమోదు చేస్తున్నారా అంటే లేదనే సమాధానం వస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు సైతం ఇప్పటి వరకూ పరిశీలించారో లేదో కూడా తెలియని పరిస్థితి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చెబుతున్న పింఛన్ల పంపిణీ రోజున సైతం ఆయన విధులకు హాజరుకారని చెబుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగులే అక్కడి పనులన్నీ నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఎస్‌సి పేటలో డ్రెయినేజీ సమస్యతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లు వంటివి తీసుకోవాలంటే ఈ పంచాయతీలో పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ముఖ్యంగా కిందిస్థాయి ఉద్యోగులను సదరు కార్యదర్శి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తారని సమాచారం. ఉద్యోగుల జీతాల బిల్లు కూడా సకాలంలో చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు కార్యదర్శిని కొద్దిరోజుల క్రితమే క్రొవ్విడి పంచాయతీకి మళ్లీ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఒక పంచాయతీలోనే సరిగా విధులు నిర్వహించని అధికారిని మరో పంచాయతీకి ఇన్‌ఛార్జిగా నియమించడం ఏమిటో అర్థం కాని పరిస్థితి. సదరు కార్యదర్శి ఎక్కడ పని చేసినా విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని మందలపర్రు ప్రజలు కోరుతున్నారు. మందలపర్రు పంచాయతీ కార్యదర్శి పని తీరుపై ఎంపిడిఒ జి.విజయకుమారిని వివరణ కోరగా ఇప్పటి వరకూ సమస్య తన దృష్టికి రాలేదని, పరిశీలిస్తానని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వంపై ఆయనకు ఇటీవల షోకాజ్ నోటీస్ ఏమైనా ఇచ్చారా అని అడగ్గా లేదని చెప్పారు.

ఎస్‌పి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆధ్వర్యంలో ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ఆశ్రం ఆసుపత్రి సిబ్బంది, ఆంధ్ర హాస్పిటల్, స్టార్ డెంటల్, శ్రీడెంటల్, వాసన్ ఐ కేర్ వైద్యాధికారులు, పలు వైద్యసంస్థల వారు పాల్గొని ఉచిత పరీక్షలు చేసి మందులను అందించారన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యకరంగా ఉంటేనే సమాజంలో మెరుగైన సేవలను అందించగలుగుతామన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. సిబ్బందికి బిఎంఐ పరీక్షలను జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ డివిజన్‌లలో పోలీస్ సిబ్బందికి జిల్లా యూనిట్ వైద్య సిబ్బందితో నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహణకు జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్‌ఎస్‌ఎస్.శేఖర్ ఎఆర్ డిఎస్‌పి శ్రీహరి, ఆర్ఐ పవన్ కుమార్ పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేసిన నేపథ్యంలో అధికారులందర్నీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ వైద్య శిబిరంలో ఆశ్రం హాస్పిటల్ నుంచి డిజిఎం సాయి శ్రీనివాస్, పిఆర్ఒ పి.దుర్గాప్రసాద్ పాల్గొని కార్డియాలజీ జనరల్ మెడిసిన్ గైనకాలజిస్ట్ జనరల్ సర్జన్, ఇజిసిలపై వైద్య సేవలందించారు. ఆంధ్ర హాస్పిటల్ వైద్యాధికారులు ఎస్.మురళీకృష్ణ, వారి సిబ్బంది పాల్గొని ఆర్తో జనరల్ సర్జరీ జనరల్ మెడిసిన్ కార్డియాలజిస్ట్ డెంటిస్ట్ ఇసిజి, బిపి, షుగర్ పరీక్షలను నిర్వహించారు. స్టార్ డెంటల్ హాస్పిటల్ నుంచి డాక్టర్ ఎస్ఎస్ పాల్గొని డెంటిస్టు పరీక్షలు చేశారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నుంచి డాక్టర్ శ్రావణి పాల్గొని కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. శ్రీ డెంటల్ డాక్టర్ నాగభూషణం పాల్గొని దంత పరీక్షలను సిబ్బందికి నిర్వహించి పలు సూచనలు, సలహాలు, మందులను ఉచితంగా అందించారు.


పరీక్షలు చేయించుకుంటున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

కలరాయనగూడెంలో ఉచిత వైద్యశిబిరం

లింగపాలెం :మండలంలోని కలరాయనగూడెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు ఆంధ్ర హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మొదట టిడిపి సీనియర్ నాయకుడు నందిగం సీతారామ తిలక్ (బాబి) రిబ్బన్ కట్ చేసి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వివిధ ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు శిబిరానికి తరలొచ్చారు. వైద్యులు స్వరూప్‌రెడ్డి, శృతి, రమేష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆరోగ్యపరంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముసునూరి గంగాధర్, రాంబాబు, శ్రీకృష్ణ వరప్రసాద్, నందిగం శ్రీధర్, కొల్లి సుధాకర్, గద్దల సాగర్ తదితరులు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న సిబ్బంది

విజయవాడ బస్సు సర్వీసును పునరుద్ధరించరూ..!

చింతలపూడి మండల ప్రజల వేడుకోలు

బస్సు రద్దుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన

ప్రజాశక్తి - చింతలపూడి

విజయవాడ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. చింతలపూడి నుంచి విజయవాడకు ప్రతిరోజు బస్సు ఉండేదని, ఆ బస్సు రద్దు చేయడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. విజయవాడ వెళ్లాలంటే చింతలపూడి నుంచి ఏలూరు వరకు వెళ్లి అక్కడ నుంచి విజయవాడకు మరొక బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. కూటమి నాయకులు బస్సు సర్వీసు విషయాన్ని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రమైన చింతలపూడి అభివృద్ధిని గత పాలకులు విస్మరించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పాలకులంతా ఎన్నికల సమయంలో చింతలపూడి మండలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వడం, గెలిచిన తర్వాత జంగారెడ్డిగూడెంలో మకాం పెట్టడంతో, చింతలపూడి అభివృద్ధిలో వెనుక పడిందని చెబుతున్నారు. చింతలపూడి మండలంపై సవితి ప్రేమ చూపిస్తూ అభివృద్ధిని మర్చిపోయారని విమర్శలు చేస్తున్నారు. చింతలపూడి నగర పంచాయతీలో మహిళలకు పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టినా ఇప్పటివరకు దాని గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతలపూడి మండలంలో అభివృద్ధికి బాటలు వేయాలని కోరుతున్నారు.



బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరని చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు చెప్పారు. లైసెన్సు కల్గిన వారు మాత్రమే ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి బాణసంచా విక్రయాల చేయాలన్నారు. జిల్లాలో అక్రమంగా బాణసంచా తయారీ, సరఫరా, విక్రయాలు చేసేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా జనసంచార స్థలాల్లో లేదా అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఆలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు చోటు హర్షణీయం

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్రంలోని ఆలయాల కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించడం హర్షణీయమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు లంకా రత్నారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల పాలక కమిటీల్లో నాయీ బ్రాహ్మణులను నామినేట్ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నారు. దీంతో బిసి-ఎ సామాజిక తరగతికి చెందిన నాయీ బ్రాహ్మణులకు అన్ని ఆలయాల్లో పాలకవర్గ సభ్యులుగా ఒకరికి అవకాశం కల్పించడమైందని నాయీ బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి విజయకుమార్ అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కొత్తకోట స్వామి, మల్లువలస అచ్చారావు, పోతునూరి శరత్, కోడూరు నాగరాజు, పసలపూడి వెంకట సత్యనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి

ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో వాహనదారులకు తీవ్ర గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై చావలపాడు వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన వేంద్రం వెంకటేష్ వల పట్టుబడులు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం వల పట్టుబడి పనికి భైరవపట్నం వచ్చి సాయంత్రం తిరిగి ఆలపాడు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఉత్తరప్రదేశ్ గరకపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రామకృష్ణ, శ్రీరామసుబ్రహ్మణ్యం వడ్రంగి పనులు నిర్వహించుకుంటూ గుంటూరులో నివాసముంటున్నారు. ఆదివారం భీమవరంలో వడ్రంగి పని నిర్వహించుకుని తిరిగి గుంటూరు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. చావులపాడు వద్దకు వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు అదుపుతప్పి బలంగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ముగ్గురికి తలకు బలమైన గాయాలు కావడంతో రక్తస్రావమైంది. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా 108 వాహనం అందుబాటులోకి రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రోడ్ సేఫ్టీ వాహన పోలీసులు క్షతగాత్రులను వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని పెదరాయిగూడెంలో కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పెదరాయిగూడెంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సిఐ రమేష్‌బాబు ఆదేశాల మేరకు ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన పొలగాని శివప్రసాద్, పొలగాని రాంబాబు, కటారి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చింతలపూడి : మండలంలోని నాగిరెడ్డిగూడెంలో కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగిరెడ్డిగూడెంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.8100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


మండలంలోని స్వర్ణవారిగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని స్వర్ణవారిగూడెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.2200 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారందరిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దెందులూరు : మండలంలోని కొవ్వలి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొవ్వలి గ్రామం చిన్న దళితపేటలో పేకాట ఆడుతున్నారన్న సమచారం మేరకు దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24,330 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని అమరవరం రాజీవ్‌నగర్ గ్రామాల మధ్య కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ఉన్న భద్రాది కొత్తగూడెం జిల్లా రెడ్డిపాలెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే ఫెర్టిలైజర్ సేల్స్ మేనేజర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు నిర్మాణంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ ప్రమాదం చోట చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును తవ్వి కంకర పోసి కలపకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అయినా ఆర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బోల్తా పడిన కారు

ఏజెన్సీలో మద్యం సిండికేట్..!

ఆందోళనలో గ్రామాల్లో మహిళలు

పాలకులు, నాయకులపై విమర్శలు

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంతో రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశం ఉందని నిపుణుల అంచనా. ఇదంతా ఒక ఎత్తయితే వచ్చిన దుకాణదారులు చేపట్టబోయే సిండికేట్ మాయ ప్రజల జేబుకు చిల్లు చేయటం ఖాయమని చెప్పుకోవచ్చు. కుక్కునూరులో రెండు దుకాణాలు ఏర్పాటు చేయగా వేలేరుపాడు మండలంలో ఒకటి కేటాయించారు. గత ప్రభుత్వంలో మద్యం వ్యాపారం లేకపోవడంతో సిండికేట్ కనుమరుగైపోయింది. మళ్లీ ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంతో సిండికేట్ డేగ కన్నుతో మాయ చేయడానికి రెడీగా ఉంది. ఈ సిండికేట్‌తో వారి వ్యాపార సామ్రాజ్యాన్ని మూడు పూలు ఆరు కాయలుగా చేసుకోవటానికి మంతనాలు షురూ చేస్తున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఈ సిండికేట్ మాయకు, అధికారుల ఆలోచన విధానానికి మందుబాబుల కుటుంబాలు కూడా ఆధారపడి ఉన్నాయని తెలుస్తోంది. మద్యం షాపులు దక్కించుకున్న నిర్వాహకుల పని మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా మారింది. బెల్టుషాపులు పెట్టేందుకు గ్రామాల్లో నాయకులు పోటీ పడడంతో షాపు నిర్వాహకులకు కాసులు కురిపిస్తున్నాయి. బెల్టుషాపులు నిర్వహించకూడదని నిబంధన ఉన్నప్పటికీ తూట్లు పొడుస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తుంది. మద్యం షాపులు ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి గ్రామాల్లో నాయకులు బెల్టుషాపులు ఏర్పాటు చేసేందుకు పోటీ పడటంతో నిర్వాహకులకు ఇది కాసుల వర్షం కురిపిస్తోందని తెలుస్తోంది. ఏదేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే భారీగా మద్యం రేట్లు తగ్గిస్తామని చెప్పిన మాట నెరవేర్చలేదు. షాపు నిర్వాహకులకు మాత్రం కాసుల వర్షం కురుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రతి గ్రామంలో తాగునీరు అందుతుందో లేదో తెలియదు కాని మందుబాబులకు మద్యం మాత్రం ఎనీ టైం దొరికే వెసులుబాటు అయితే షాపు నిర్వాహకులు కల్పిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం గ్రామాల్లో ఏమి జరుగుతుందో తెలియనట్లుగా ఉదాశీనతగా వ్యవహరించటం పట్ల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



ఎంఎల్ఎ ధర్మరాజుపై దుష్ప్రచారాలు మానుకోవాలి

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇలాంటి చర్యలు

జనసేన నేత రెడ్డిఅప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉంగుటూరు ఎంఎల్ఎపై నీలి మీడియా చేస్తున్న దుష్ప్రచారాలు మానుకోవాలని రెడ్డి అప్పల నాయుడు హెచ్చరించారు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కాలేదని, అప్పుడే వైసిపి నాయకులు ఉంగుటూరు ఎంఎల్ఎపై దుష్ప్రచారాలు చేయడం సరికాదన్నారు. తన సొంత ఆస్తిలోంచి సగం దాన ధర్మాలకే అందిస్తున్న ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. జనసేన పార్టీ ప్రశ్నించడానికి వచ్చిన పార్టీ అని, ఎటువంటి అవినీతి జరక్కుండా చూసే పార్టీ అని చెప్పారు. ఎద్దేవా చేస్తున్న పార్టీలు వారి అవినీతి మరకలను జనసేనకు పూయాలని నీలిమీడియా ప్రయత్నాలు చేస్తుందన్నారు. గత ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని ఉంగుటూరు నియోజకవర్గాన్ని ఎంఎల్ఎ ధర్మరాజు అభివృద్ధి చేయడం చూసి దానికి అడ్డుపడడానికి ఇటువంటి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేవలం బటన్ నొక్కడానికే పరిమితమై రాష్ట్రాభివృద్ధి కోసం ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి పింఛనుదారునికి పెంచుతామన్న రూ.నాలుగు వేల పింఛన్‌ను మొదటి నెలలోనే అందించామని, ఉచిత ఇసుకను ఇప్పటికే లబ్ధిదారులకు అందేలాగా చేస్తున్నామన్నారు. రేపు దీపావళికి మహిళామణులకు చేసిన వాగ్దానం ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నామన్నారు. ఈ సంక్షేమ పథకాలను చూసి కొంతమంది ఓర్వలేకపోతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, నగర ఉపాధ్యక్షులు సుందరనీడి వెంకట దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కావూరి వాణిశ్రీ, కార్యదర్శి ఎట్రించి ధర్మేంద్ర, మీడియా ఇన్‌ఛార్జి జనసేన రవి పాల్గొన్నారు.

పంపుసెట్లకు మీటర్లు బిగించొద్దు

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు రైతుల మెడలకు ఉరితాళ్లు అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. జీలుగుమిల్లిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రైతు సంఘం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రయివేటీకరణ కోసం విద్యుత్ సవరణ బిల్లు తీసుకొచ్చిందన్నారు. ఈ బిల్లులో ఉచిత విద్యుత్ అమలు చేయడానికి వీలు లేదని పేర్కొన్నారని వివరించారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విద్యుత్ బిల్లును అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. కేంద్రం ఆదేశాల మేరకు గత వైసిపి ప్రభుత్వం జిఒ 22న తీసుకొచ్చి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ప్రక్రియ ప్రారంభించిందని, తెలుగుదేశం, జనసేన పార్టీలు వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపు ప్రక్రియను వ్యతిరేకించి ఎన్నికల్లో లబ్ధి పొంది ఇప్పుడు స్మార్ట్‌మీటర్లకు వత్తాసు పలకడం దుర్మార్గమని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించడమే కాకుండా గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. పైగా వేలకోట్ల రూపాయలు ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం తగదన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపును రైతులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ వంకవారిగూడెంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల గిరిజనులు, గిరిజన పేద రైతులు భూములు కోల్పోవడమే కాకుండా వ్యవసాయ ఆధారిత ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తాళ్లూరి సూర్యారావు, సుంకవల్లి శేషగిరిరావు, దాసరి రామారావు, యలమాటి నరసింహారావు పాల్గొన్నారు.

కార్మికులకు పక్కా గృహాలు నిర్మించాలి

ఎంఎల్ఎ బడేటి చంటిని కోరిన ఎఐటియుసి జిల్లా కోశాధికారి కన్నబాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో మాజీ ఎంఎల్ఎ, సిపిఐ నాయకులు అత్తులూరి సర్వేశ్వరరావు స్థాపించిన ఎఐటియుసి అనుబంధ పొగాకు పనివారల సంఘంలో ఉన్న కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు స్థానిక ఎంఎల్ఎ బడేటి చంటిని కోరారు. పొగాకు పనివారల సంఘం జనరల్ బాడీ సమావేశం యూనియన్ నాయకులు గోళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత సమావేశంలో ఇటీవల మరణించిన యూనియన్ అధ్యక్షులు జోగి నాగేశ్వరరావుకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. జోగి నాగేశ్వరరావు స్థానంలో సంఘం అధ్యక్షులుగా బి.పోతురాజుని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ పొగాకు పనివారిలో ఎక్కువమంది అనారోగ్యానికి గురవుతున్నారని, వారికి సంబంధించి 50 ఏళ్లు పూర్తవ్వగానే వృద్ధాప్య పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పొగాకు వర్తకులు వాళ్ల దగ్గర పనిచేస్తున్న పొగాకు పనివార్లకు వేతన ఒప్పందాన్ని అమలు చేసి వేతనాలు సక్రమంగా ఇవ్వాలని వర్తకులను కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్యాగధనుడు అత్తులూరి సర్వేశ్వరరావు నిర్మించిన పొగాకు పనివారల సంఘాన్ని నిర్మాణపరంగా అభివృద్ధి చేసేందుకు సంఘ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు, కోశాధికారి చింతపల్లి కూర్మారావు, బాపిరాజు, చిన్ని, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'26న మాల మహా గర్జన'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అఖిల భారత మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో హలో మాల చలో అమరావతి అనే నినాదంతో మాలల జెఎసి ఛైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్ పిలుపుమేరకు నవంబర్ 26న నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ స్థలంలో జరిగే మాల మహా గర్జనకు లక్షలాదిగా తరలి రావాలని మాల మహాసేన జాతి అధ్యక్షులు అలగ రవికుమార్ పిలుపునిచ్చారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న లేడీస్ క్లబ్‌లో ఆదివారం మాల మహాసేన నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, రాష్ట్ర అధ్యక్షులు కొమ్మిన అగస్టీన్, వాసే రత్నం మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి అంబేద్కర్ సంఘాలు, డ్వాక్రా సంఘాలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున తరలివచ్చి సత్తా చూపించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దయచేసి పునరాలోచించాలని కోరారు.

'ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచిన చంద్రబాబు'

ప్రజాశక్తి - ముసునూరు

గతంలో ప్రమాద బీమా రెండు లక్షల ఉండగా, నేడు సిఎం చంద్రబాబు రూ.ఐదు లక్షలకు పెంచారని టిడిపి మండలాధ్యక్షులు దేవినేని ధలరామ్ తెలిపారు. ఆదివారం మండలంలోని 16 గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు సీతారామాంజనేయులు, పవనస్వామి, నక్క యోహాన్, తోట శ్రీనివాసరావు, కొండేటి బాబి, దేవినేని సాంబయ్య, టి.రంగారావు, మెదరమెట్ల సురేంద్ర, వేంపాటి సత్యనారాయణ, శ్రీనివాసరావు, కాంతారావు, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఆర్ఆర్.పేట ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్ధన సమాజం పునరుద్ధరణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమావేశం బాలబాలికల వేద పఠనంతో ప్రారంభమైంది. ప్రార్ధన సమాజం కమిటీ అధ్యక్షులు కెకెవి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యక్షులు చల్లా కేశవచంద్ ప్రార్ధన సమాజ చరిత్రను వివరించారు. అనంతరం బ్రహ్మ సమాజం తరపున నిర్వహించిన బ్రహ్మ సమాజం - రాజా రామ్మోహన్‌రాయ్ అంశంపై వ్యాసరచన పోటీలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ముగ్గురు విజేతలను ఎంపిక చేసి నగదు బహుమతులు, ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. చివరిగా ఏలూరు ప్రార్ధన సమాజ ప్రథమ కార్యవర్గ సమావేశం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు.

చెక్కపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లిలో ఉన్న నా ఉయ్యానా మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు జంపాల సత్యనారాయణరాజు తెలిపారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్రాంగణంలో ఆయుర్వేదం, హోమియోపతి, ఫిజియోథెరపీ, మానసిక వైద్య పరీక్షలు, జనరల్ మెడిసిన్, కంటి, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, దంతాలు, గుండె, కేన్సరు, పలు రోగాలకు అన్ని పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు మాగంటి ప్రసాద్ తెలిపారు. ఆశ్రం హాస్పటల్ కాలేజీ సిబ్బంది, భీమవరం విష్ణు వైద్య శాఖ సిబ్బంది డాక్టర్ రావూరి రాజారావు, కూరపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిగూడెం విద్యార్థినుల ప్రతిభ

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా అందులో నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు ఎన్.హేమలక్ష్మీప్రసన్న, కె.గౌరీపూజశ్రీ ఎంపికయ్యారు. ఎంపికైన బాలికలను, పిఇటి బాలభారతిని పాఠశాల ప్రిన్సిపల్ మండలి బ్రాహ్మణేశ్వరమ్మ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ సత్యనారాయణ వారి సిబ్బందితో పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ వ్యక్తిగతంగా, సామూహికంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో భాగంగా రౌడీ షీటర్లందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకూడదని, సమాజంలో శాంతి సామరస్యాలకు విఘాతం కల్పించకూడదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకూడదని, అందరూ మంచి నడవడికను కలిగి ఉండి సత్ప్రవర్తన కలిగి ఉండాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని హెచ్చరించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

సంక్షోభంలో విద్యారంగం

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

పాలకుల అసంబద్ధ నిర్ణయాలతో విద్యారంగం సంక్షోభం లోకి నెట్టబడుతోందని పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. మండలంలోని కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ మండల మహాసభకు బిఆర్ఎం.కోటేశ్వరస్వామి అధ్యక్షత వహించారు. తొలుత అమరజీవుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు గుణాత్మకమైన బోధన ద్వారా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించమని చెప్పే ధైర్యం ఉందా అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధి చెందేలా నేటి ప్రభుత్వం కృషి చేయడం లేదన్నారు. విద్యార్థుల చదువు కోసం రూపొందించిన పాఠ్యపుస్తకాలు ఉపాధ్యాయులకు అర్థం కాకపోతే విద్యార్థులకు ఏం అర్థమవుతాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. సెక్రటరీ, డైరెక్టర్ ముందుమాట రాస్తారని, అయితే లోపల ఏముందో చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు ప్రశ్నించినా విద్యాశాఖ ఆర్‌జెడి, డిఇఒ పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యపుస్తకాలు రూపొందించాలని కోరారు. సబ్జెక్టును అర్థం చేసుకుని మార్కులు లేని చదువులు కావాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించే గొంతుక కోసం టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలని కోరారు. మహాసభలో యుటిఎఫ్ సీనియర్ నాయకులను సత్కరించారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రతి హైస్కూల్ నుంచి స్కూల్ ఫస్టు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన గురువులకు సన్మానం, స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, రిటైర్డ్ ఎంఇఒ జి.కనకరాజు, ప్రధానోపాధ్యాయురాలు కె నిర్మలా దేవి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామ భద్రం, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, కె.సాయిరాం, కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, కుమార్ బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ జివి.రామానుజరావు, బి.రాజ్యలక్ష్మి, సిఐటియు నాయకులు గొర్ల రామకృష్ణ, అంగన్వాడీ నాయకులు మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా వివిఆర్‌కె.రవికుమార్‌రాజు, అధ్యక్షులుగా బిఆర్ఎంకె.స్వామి, సహాధ్యక్షులుగా పి.ప్రభుదాసు, సహాధ్యక్షురాలిగా కనకదుర్గ, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్రావు, కోశాధికారిగా ఎల్.అప్పలాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నకిలీ సర్టిఫికెట్లతో మోసం

వారిపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

భీమవరం : పురోహిత, అర్చక సమాఖ్య పరీక్షల పేరిట నకిలీ సర్టిఫికెట్లతో అక్రమార్జనకు పాల్పడుతోన్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌విఎన్.శర్మ, జి.ధనుష్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ పనిచేస్తున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ పురోహిత, అర్చక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఉన్న యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శనం దుర్గబాబులు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని గ్రామాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల దేవాలయాలలో పనిచేస్తున్న అర్చకులకు, పురోహితులకు పరీక్షలు నిర్వహించారన్నారు. అర్హత పట్టాలు అందజేస్తామని ఆ పట్టాల ద్వారా పర్సనల్ లోన్లు, బ్యాంకు లోన్లు, విదేశాలకు పాస్ పోర్టులు, రైల్వే ప్రయాణాలకు రాయితీ టికెట్లు పొందవచ్చునంటూ రాష్ట్రంలోని అర్చక, పురోహిత విద్యార్థులను నమ్మించి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గ దేవస్థానం, అన్నవరం దేవస్థానాల నకిలీ స్టాంపులు, ఆగమ, పరీక్షాధికారుల ఫోర్జరీ సంతకాలతో నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి ఆ సర్టిఫికెట్లతో వేలాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నా రన్నారు. ఈనెల 28న భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ అర్చక, పురోహిత సమాఖ్య పరీక్షలలో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి, స్థానిక భీమవరం, ఉండి ఎంఎల్ఎ, ఇతర ఆగమ పరీక్షాధికారులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు పాల్గొంటున్నారని, పరీక్షలలో విజయం సాధించిన వారికి పట్టాలు, సర్టిఫికెట్లు ఇవ్వనున్నామని సామాజిక మాధ్యమాలలో వీడియోలతో యామిజాల నర్సింహమూర్తి, సుదర్శనం దుర్గబాబులు పలు రకాలుగా ప్రచారం నిర్వహించారన్నారు. ఈ నకిలీ అర్చక పరీక్షలను రద్దుచేయాలని, అర్చక, పురోహిత విద్యార్థుల నుంచి అక్రమంగా వేలాది రూపాయల వసూళ్లకు పాల్పడుతోన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.